మానవ సంబంధాలన్నీ ఆర్థిక బంధాలేననే మనోసత్యాన్ని అతడెలా దర్శించాడు?

# మనోదర్శనం

బి.యస్.వాసు
కథ

నేను గమనిస్తూనే ఉన్నానంతా...

అయితే నేను గమనిస్తున్నది నా కళ్లలో కాదు... మనస్సుతో.

కళ్లు తెరుద్దామని ప్రయత్నించాను. తెరుచుకోలేవు. చేతులు కదలిద్దామని చూసాను... కదలలేవు. కాళ్లు కొద్దిగా ప్రక్కకి నెట్టడానికి ప్రయత్నించాను... సాధ్యపడలేదు.

శ్వాసమాత్రం ఆడుతూంది.

గుండె మెల్లిగా కొట్టుకుంటూంది.

యెమర్జెన్సీ వార్డ్‌లో బెడ్‌మీద పడుకున్నాను. నా ముక్కులోంచి ఆక్సిజన్ ఎక్కుతూంది.

నా బెడ్ కుడి ప్రక్కన బల్లమీద కంప్యూటర్‌లా కనిపిస్తుంది... కార్డియక్ మోనీటర్.

దానిమీద బూడిదరంగు స్క్రీన్‌మీద వొక పక్కనుండి కదులుతున్న గ్రీన్‌కలర్ గ్రాఫ్ గీతలు, రెండో ప్రక్కలో అంతమవుతున్నాయి... నా హృదయ స్పందనని తెలియజేస్తూ.

అకస్మాత్తుగా బ్లడ్‌ప్రెజర్ పెరిగి, సిస్టాలిక్ 190, డయాస్టాలిక్ 140కి చేరుకోవటంతో, ఆ మెదడులోని రక్తనాళాలు చిట్లాయి.

డాక్టర్లు, 'సెరెబ్రో వస్క్యులర్ డిసీజ్' అని, హోప్స్ లేవని చెప్పేసారు.

అంటే... ఇప్పుడో, ఇంకాసేపట్లోనో నాకూ, నా శరీరానికీ మధ్య యే లింకూ వుండదన్నమాట!

వొక్క నా శరీరానికే కాదు... నా కుటుంబ సభ్యులతోను, బంధు



మిత్రులతోనూ ఇక ఏ సంబంధమూ వుండదు.

నా బెడ్ ప్రక్కనే స్టూల్‌మీద కూర్చున్న నా భార్య ముఖంలోకి చూసాను.

ఆ ముఖంలో నిర్లిప్తత.

దుఃఖాన్ని గుండెల్లో పాదుముకొని జరగబోయే నా మరణానికి మానసికంగా సిద్ధమవుతుందా?

తూర్పు నుంచి పడమరకు తిరిగిన వయస్సు, కాలం 'వృద్ధురాలి'గా మార్చింది.

శరీరకంగానూ, మానసికంగానూ బల హీనమయిన ఆమె గుండె ఈ విషాదాన్ని ఎలా భరించగలదు?

ఆప్యాయంగా ఒక్కసారి దగ్గరకి తీసుకుని స్పృజించాలన్న కోరిక! తీరదని తెలుసు. అయినా...

నా గుండెల్లో దుఃఖం సుళ్లు తిరుగుతూంది.

ఎన్ని రోజులు ఒకరికొకరం తోడున్నాం.

మరిప్పుడు?

ఎవరికి వారే!

అందరి మధ్యనుంచి నేనొక్కడినే వెళ్లిపోతున్నానన్న భావమే నన్ను నిలువునా కుదిపేస్తుంది. సముద్రమంతటి విషాదాన్ని మిగులుస్తుంది.

నా శరీరంలోంచి మెల్లిగా గాలిలోకి లేచాను.

నా మనస్సుతో నా భార్య తలని ఆప్యాయంగా నిమరసాగాను. నా స్పర్శ ఏమాత్రం తెలియటం లేదు తనకి.

ఏడ్చి ఏడ్చి అలసిపోయిన ఆ కళ్లలోకి చూసాను.

ఆ కళ్లలో 'ఏదో' భావం!

తననెవరో గమనిస్తున్నట్టు చటుక్కున కళ్లు మూసుకుంది.

ఏందుకలా?

ఆ భావం నేను చదవటం ఇష్టం లేకనా?

నేను వొదిలిపెట్టదల్చుకోలేదు. ఆ భావాన్ని నేను చదవాలి. చదివి తీరాలి.

తన మనస్సులోకి తొంగి చూసాను.

మనోపొరల మధ్య లిఖించబడ్డ ఆలోచనని చదివి వులిక్కిపడ్డాను.

నిజమా?!

నిజమేనా?!

తను, నా భార్య... ఎన్నో సంవత్సరాలుగా నాతో కాపురం చేస్తున్న నా భార్య, నేను 'త్వరగా' చస్తే బావుండనని కోరుకుంటుందా?

పెరాలిసిస్‌తో నా కాళ్లు చచ్చుబడిపోతే సంవత్సరం నుండి నాకు సపర్యలు చేస్తుంది. అప్పుడప్పుడూ విసుక్కునేది. అలాంటిది, ఇప్పుడు నా చావుని కోరుకుంటుందంటే–

సంవత్సరంపాటు నాకు చేసిన సేవలపట్ల ఏవిధంగా ఫీలయ్యిందో అర్థమవుతూంది.

ఆ ఫీలింగ్స్‌కి పరాకాష్టగా నా చావుని కోరుకుంటుంది.

'ఇక ఈ సేవలు నేను చేయలేను. నాకు చేతకాదు' – అనుకుంటుందామె.

హిందూ స్త్రీగా, తన ఆలోచనని బయటపెట్టలేకపోయింది.

కారణం?

–సమాజం!

నాలుగక్షరాల సమాజం నాలుగు రకాలుగా ఆలోచిస్తుంది...

ఆ సమాజంలోని వ్యక్తులుగా ముందు నా ఇంటినుండే ప్రారంభమవుతారు...

కొడుకూ, కూతురూ, కోడలూ,

మనవడూ... ఇలా...

వీళ్లందరికీ వాదన, భర్తకి భార్యగాక ఇంకెవరు చేస్తారన్నదే!

అందుకే భయపడింది.

తన ఫీలింగ్స్‌ని తనలోనే 'సీల్' చేసుకుంది.

మనిషి అన్నిటికన్నా ఎక్కువగా భయపడేది ఈ సమాజానికే అనిపిస్తోంది.

'మాన్ ఈజే సోషల్ యానిమల్' - అన్న అరిస్టాటిల్ 'ది గ్రేట్' అనిపిస్తుంది.

నిజం చెప్పాలంటే - గత సంవత్సర కాలంగా నేనెంత కుమిలిపోయానో నాకు మాత్రమే తెలుసు.

ఏ పని చేసుకోవాలన్నా - ఇంకొకరిపై ఆధారపడాలి.

ఇంట్లో - మొదట్లో నామీద జాలి చూపించిన వాళ్లే క్రమ క్రమంగా విసుక్కోసాగారు.

అంతకు ముందు - అంటే -నాకు పెరాలిసిస్ స్ట్రోక్ రాకముందు, నేను ఇంట్లో వున్నానంటేనే హడల్. ఎక్కడివాళ్లక్కడ గప్‌చుప్ - అనిపిస్తుండేది.

నా మనవడిని ఎప్పుడైనా కోపంగా చూశానంటే - వాడు చెడ్డీలోనే 'వన్' చేసుకున్నంత పని చేసేవాడు.

నేను సివిల్ ఇంజనీర్ని. బాగా బ్రతికినవాడ్ని. డబ్బు కూడా బాగా సంపాదించాను.


నాకు ఇంట్లోనూ, బయటానూ గౌరవముండేది. గౌరవముండేదగ్గర భయం కూడా ఉంటుంది.

ఆ భయం పోవటమనేది 'ఆరోజు'తో ప్రారంభమైంది.

ఆరోజు...

ఇంటర్మీడియెట్ చదువుతున్న నా మనవడిని పిల్చి, నాకు వ్రాసిచ్చిన మందుల చీటి ఇచ్చి చెప్పాను - మందులు తెచ్చిపెట్టమని!

వాడు కొంత చిరాగ్గా చీటి లాక్కుంటూ అన్నాడు -



“ఇందాకట్నుంచీ ఏంచేసావ్ తాతయ్యా? నేను సరిగ్గా సిన్మాకెళ్లే టైంలోనే చెప్తున్నావ్!”

నేను జవాబు చెప్పేలోపు, ఆ ప్రిస్క్రిప్షన్ లాక్కొని వెళ్లిపోయాడు.

పది నిముషాల్లో తిరిగొచ్చి, టాబ్లెట్స్ నా చేతికిచ్చాడు.

ట్యాబ్లెట్స్ చూడగానే అర్థమైంది - అవి లోకల్ కంపెనీ తయారీ అని.

“ఇవి లోకల్ కంపెనీవిరా! ర్యాన్‌బ్యాక్సీ కంపెనీవి తెచ్చిపెట్టు” - చెప్పాన్నేను.

“ఏవైతేనేం తాతయ్యా!

కంపోజిషన్ వొక్కటేగా! ఇవి వేస్కోండిగారు!”

“బావుండవురా!”

“ఇవి బావుండకపోతే - బావుండేవి నువ్వే తెప్పించుకో! నాకు టైం లేదు” - కోపంగా అంటూ బయటికి నడిచాడు.

అంతలో నా కోడలు పిల్చింది వాడ్ని. నాకు వినిపిస్తోంది లోపలికి -

“ఏమిటి గట్టిగా అరుస్తున్నావ్? తాతయ్యకి ట్యాబ్లెట్స్ తెచ్చిచ్చావా?” అడిగింది.

“తెచ్చిచ్చాను మమ్మీ! కాని - అవి వొద్దంట! వేరే కంపెనీవి కావాలంట!”

“మరి తెచ్చిపెట్టు!”

“నాకు సిన్మా టైం అయిపోతూంది మమ్మీ! అయినా-ఒక్కపూట ట్యాబ్లెట్ వేస్కోకపోతే తనేం చావడుగా!”

వొక్కసారిగా స్టన్నయ్యాను.

నిజమే! వొక్క పూటకి ట్యాబ్లెట్ వేస్కోకపోతన-నేనేం చావకపోవచ్చు!

కానీ-కానీ-

సున్నితమైన మనోగతంపై ఎలక్ట్రిక్ షాకిచ్చాడు నా మనవడు-బయటికి కనిపించని షాక్ అది.

క్రమంగా వొక్కొక్కరికీ నామీద భయం పోయింది.

భయం పోతే పోయింది కానీ-అదృష్టంకొద్దీ నా భార్యా, నా కొడుకూ, నా కోడలూ నన్ను 'బాగానే' ట్రీట్ చేసేవాళ్లు.

ఎవరికీ తప్పినా, నా పన్లు నా భార్యకి తప్పేవి కావు.

వొక్కోసారి విసుక్కునేది.

నాకోపమొచ్చేది. అయినా ఆలోచించేవాడ్ని - తనకీ వయస్సు మీద పడ్తోంది. ఎన్ని పన్లని చేయగలదు?

ఎన్ని రోజులిలా? నాకసలు బాగవుతుందా?

కాదేమో!

మరి ఇలా బతకాల్సిందేనా?

తన పని తను చేసుకోలేనివాడు చావటమే మంచిదేమో!

“మెర్సీ కిల్లింగ్' - బతుకుతూ నరకాన్ని అనుభవించేవాడ్ని చంపేసే పద్ధతి!

వొకప్పుడు ఈ పద్ధతిలో చంపటం తప్పనిపించేది! ఇప్పుడలా చేయటం తప్పు కాదనిపిస్తోంది.

అనుభవం అభిప్రాయాన్ని మారుస్తుంది.

ఆలోచన్లనుండి బయటికొచ్చాను.

నా బంధు మిత్రులంతా హాస్పిటల్ ఆవరణలో నాగురించే మాట్లాడుకుంటున్నారు.

వీళ్లందరికీ కొంత దూరంలో నా కూతురూ, అల్లుడూ కనిపించారు.

గాలిలో మెల్లిగా పైకి లేచి అటు కదిలాను.

నా కూతురు అంటూంది కోపంగా–

"ఛీ, ఛీ! ఇప్పుడెలా? చుట్టాలందరూ వస్తున్నారు! వాళ్లముందుకెలా వెళ్లాలో అర్థం కావట్లేదు"

"రెండు గంటల్లో తెచ్చిపెడ్తానని చెప్తున్నాగా! ఇందాక వెళ్తే ఆ మార్వాడీ వాడు షాపులో కనిపించలేదు. గంట తర్వాత వస్తాడట! అందాక ఓపిక పట్టు. నీ చెవి కమ్మలు తెచ్చిపెడ్తాగాని!" – అంటున్నాడు నా అల్లుడు సముదాయిస్తున్నట్లు.

విషయమర్థమైంది నాకు–

నా అల్లుడు డబ్బులేని వాడేంకాదు – ఏదో అవసరమై నా కూతురి చెవి కమ్మలు మార్వాడీ దగ్గర తాకట్టు పెట్టినట్టున్నాడు! ఇప్పుడు విడిపిద్దామని వెళ్తే లేనట్టున్నాడు! – అదీ సంగతి.

అయితే–ఇక్కడ నాకు మరో విశేషం కనిపించింది.

అందరూ నా పరిస్థితి గురించి ఆందోళన చెందుతూ(న్నట్టు) వుంటే – నా కూతురేమో, చెవికమ్మలు లేవని నల్గురి మధ్యకి రావడానికి సంశయిస్తూంది – తన 'సోషల్ స్టేటస్' తగ్గుతుందని భయపడ్తూంది.

ఏవిటీ బంధాలు?

మనిషికీ మనిషికీ మధ్య వుండే 'లింక్స్' ఇంత చీప్‌గా వుంటాయా?

నాకక్కడ వుండాలనిపించలేదు.

చుట్టాలతో మాట్లాడుతున్న నా కొడుకు దగ్గరకు వెళ్లాను.

వాడ్ని చూస్తే జాలినిపించింది.

ముఖమంతా పీక్కుపోయింది. పొద్దుటి నుంచి తిరగటమే.

తిండిలేదు. ఆకలి నకనకలాడుతూంది.

తింటే బావుండునన్న ఆలోచన!

కాని–తింటే బావుండదన్న ఆలోచన!



## కోపం!

"బస్సులో ఆ పక్కన కూర్చునే అతను నాకు చాలా కోపం తెప్పిస్తున్నాడు!" రేవతి చెప్పింది గాయత్రితో".

"అదేమిటి! అసలతను నిన్ను చూడటంలేదుగా!" రేవతితో బస్సులో ప్రయాణించే గాయత్రి అడిగింది.

"అందుకే నాకు కోపం వస్తోంది!" అసలు విషయం చెప్పింది రేవతి.

–జోకర్ (హైదరాబాద్)

కాని-తింటే బావుండదన్న భయం!

ఏదీ తేల్చుకోలేని పరిస్థితి!

ఇంతలో నా కోడలు వచ్చి, వాడ్ని ప్రక్కకు రమ్మని సైగ చేసింది.

ఇద్దరూ కొంతదూరంలోకి వెళ్లి మాట్లాడుకోసాగారు.

"పొద్దుటినుంచీ ఏదైనా తిన్నావా?" అడిగింది నా కోడలు.

"తిన్లేదు. అదే ఆలోచిస్తున్నా!"

"ఏదైనా తినేసి రారాదూ! ఈ రాత్రికి గానీ మామయ్య చనిపోతే – రేపు ఇంట్లోనుండి శవాన్ని కదిలించే వరకూ వంట చేయరు. లేటయిపోతుంది. ఇప్పుడే ఏదైనా తినిరా!"

నిజమేననిపించింది నా కొడుక్కి.

తన ఆకలి ఆలోచనకి భార్య సపోర్ట్ ఇవ్వటంతో వెళ్లి తిని రావడానికే నిర్ణయించుకున్నాడు.

ఇక్కడ ప్రతీ వొక్కరూ అంగీకరించవలసిన విషయం–

దుఃఖంకంటే ఆకలి గొప్పదని!

ఆకలి శరీర ధర్మం అయితే – దుఃఖం మానసిక ధర్మం.

శరీరముంటేనే మనస్సుకి అర్థం!

నాగురించి వాడు ఆకలితో నకనకలాడటమెందుకు?

తినేసి రావటమే మంచిది.

స్కూటర్ తీస్కొని వెళ్తా అనుకున్నాడు వాడు–

"ఇదేదో తొందరగా తేలిపోతే బావుండు! నా బిజినెస్ దెబ్బతింటూంది. ప్చ్!"

ఆ తేలిపోవటమనేది, చనిపోవటమని తెలుసు.

వాడి ఆలోచనకి నాకు ఆశ్చర్యమనిపించలేదు.

ఎన్నో సంవత్సరాలుగా కాపురం చేసిన భార్యే నా చావుని కోరుకుంటూంది. ఇదెంత?

నామీద వీళ్లకి ప్రేమ లేదని అనుకోను!

కాని-ప్రాక్టికల్‌గా ఆలోచిస్తే-నేను బ్రతికివున్నా లాభం లేదు. పైగా రిస్క్.

ఈ యాంత్రిక వేగంలో ఒక మనిషి గురించి పట్టించుకునే తీరికెక్కడిది?

ప్రతీ క్షణం స్పీడ్.

స్పీడ్, స్పీడ్, స్పీడ్.

ఈ స్పీడ్ యుగంలో ఒక్క క్షణం వృధా చేస్తే ఎక్కడ వెనకబడిపోతామో అనే భయం!

అందుకే కాలంతో యుద్ధం చేస్తున్నట్టు సాగిపోతున్నాడు మనిషి.

ప్రాక్టికల్ ఆలోచన దగ్గర సెంటిమెంట్‌కి చోటుండదు.

నేను ఆలోచన్లో వుండగానే నా మనవడు నావేపు వస్తూ కనిపించాడు.

నాగురించి వీడేం ఆలోచిస్తున్నాడా అని వాడి మనస్సులోకి తొంగి చూసాను–

వాడి మనస్సు ఆందోళనగానే వుంది.

ఆ ఆందోళన నేను ఛస్తున్నందువల్ల కాదు.

తన అభిమాన హీరో చిరంజీవి నటించిన సిన్మా రేపే విడుదల. నాలుగు రోజుల క్రిందటే అడ్వాన్స్ బుకింగ్ కూడా అయ్యింది.

నేను వచ్చానంటే – సిన్మా గోవిందా!

ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్న సిన్మా కాబట్టి – రేపు సాయంత్రం వరకు నేను చావకుండా వుండాలని వాడి కోరిక.

అందుకే వాడి ఆందోళన.

ఇప్పటి నా పరిస్థితికి వీళ్ల ఆలోచన్లు ఇలా సాగుతున్నాయ్. ఇదే పరిస్థితి నాకు పెరాలిసిస్ స్ట్రోక్ రాకముందు వచ్చివుంటే – వీళ్లందరూ ఈ విధంగానే స్పందించేవాళ్లా?

ముమ్మాటికీ కాదు.

నేను డబ్బు సంపాదించినంత కాలం నన్ను గౌరవించి, పూజించారు.

నాకు పెరాలిసిస్ స్ట్రోక్ వచ్చాక, నా 'అవసరం' తీరిపోయింది. నేను భారమయ్యాను. నాకు దూరమవ్వసాగారు.

మనిషి మనిషినీ కట్టిపడేసేది ఈ అవసరం అన్న బంధమేననిపిస్తుంది నాకు.

మార్క్స్ వోచోట అననే అన్నాడు–

మానవ సంబంధాలన్నీ కూడా ఆర్థిక సంబంధాలేనని!

నాగురించి కాలం ఆగదు.

ఈ భూమీ, ఆకాశమూ, గాలీ, వెలుతురూ... అన్నీ వుంటాయ్.

మనిషే మారుతుంటాడు.

వొక మనిషి పోతే – నల్గురు పుడుతుంటారు.

ఇది జీవధర్మం.

విషాదానికి చోటు లేదిక్కడ!

ఆలోచిస్తూనే నా శరీరం దగ్గరికి వెళ్లాను.

నన్ను నేను అందులో ప్రతిష్టించుకున్నాను.

ఇంతలో నాకు ఏమవుతుందో అర్థంకాని పరిస్థితి ఏర్పడింది.

ఏం జరుగుతూంది?!

చాలా విచిత్రంగా వుందీ పరిస్థితి!

నన్ను నా శరీరం నుండి ఎవరో బయటికి లాగుతున్నారు!

నా ఫీలింగా ఇది?

కాదు. కాదు. నిజంగానే లాగుతున్నారు.

నా కండరాలన్నీ బిగిసిపోతున్నాయి.

ఎక్కడో చలనం ఆగిపోతూంది...

నన్ను బయటికి లాగుతున్నారు. లా..గు..తు..న్నా..రు..... లాగేసారు.

బంధుమిత్రులంతా వొక్కసారిగా గొల్లుమన్నారు.

★

